కథానిక

* వెలుగు *

శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి

మిట్టమధ్యాహ్నం:

ఎండ తీవ్రంగా ఉంది. కాలే నేలలోంచి పొగర్లులేస్తున్నాయి. కాల్చే గాలి ఉండి ఉండి వీస్తోంది. వేడిగాలికీ, ఎండ వేడికి ఊరంతా ఉడికి పోతోంది. ఎక్కడ చూసినా తాపం భరించలేని వాళ్ళే కనిపిస్తున్నారు. భరించడం తప్ప ఇంకేం చేయాలో తెలియక తపించి పోతూన్నవాళ్ళే ఎక్కడ చూసినా కనిపిస్తున్నారు.

అతను ఊరిలోంచి వస్తున్నాడు. ఊరి వెలుపల నడుస్తున్నాడు.

“పోయి ఎక్కడైనా కూర్చొని ఆలోచించుకోవాలి.”

అనేవి అతను మాటిమాటికీ అస్పష్టంగా అనుకొంటోన్న మాటలు.

ఎండకి ఊరంతా తలవంచింది. అతనుకూడా తల కొంచెం వంచి నడుస్తున్నాడు.

తల వంచినప్పటికీ అతను పొడవుగా కనిపిస్తున్నాడు. అతను సాలప్రాంశుడు; మహాభుజుడు. వెడల్పుగా ఉండడంచేత, దూరనుంచి చూస్తే అతను బలంగా కనిపిస్తున్నాడు. కాని, దగ్గర్నుంచి చూస్తే అతన్లో బలం బాగా తగ్గినట్టు తెలుస్తుంది. ఎలా చూసినా అతను అందంగా కనిపిస్తున్నాడు.

అతను నీరసంగా ఉన్న మృగరాజులా ఉన్నాడు.

తాపీగా ఏనుగులా నడుస్తున్నాడు.

అతని కళ్ళు విశాలంగా ఉన్నాయి; కాని, లోతుకుపోయేయి. ఎత్తుగా, పొడవుగా, సూదిగా ఉన్న అతని ముక్కు అతని ముఖానికి ఒక విధమైన వన్నె తెస్తోంది. అతని ప్రతి అవయవం అతనికి ఏదో విధంగా వన్నె తెస్తోంది. అతని నుదురు విశాలంగా, ఎత్తుగా ఉంది. అతని పెదవుల్లో కారుణ్యం, అతని చుబుకంలో అసాధారణమైన పట్టుదలా కనిపిస్తున్నాయి.

అతని జుత్తు కొన్ని సంవత్సరాలనుంచీ ఎదుగుతోన్నట్టుగా ఉంది. అన్ని సంవత్సరాలనుంచీ ఎట్టి సంస్కారం లేక పీచుగట్టి ఉంది. ఎత్తుగా తల మధ్యకి ముడిపెట్టి ఉంది.

తలంతా అలా ఉన్నప్పటికీ అతని ముఖం మాత్రం ఎంతో నున్నగా, శుభ్రంగా అప్పటికప్పుడు గడ్డం తీయించుకొన్నట్టుగా ఉంది.

అతని ముఖంలో, శరీరంలో, తేజస్సు ఉంది, కాని, స్పష్టంగా కనిపించడంలేదు. అతను, పల్చటి మబ్బువెనక ఉండే సూర్యుళ్లా ఉన్నాడు. అతను, కడగని, తళుకుపెట్టని, భగవంతుడి బంగారు విగ్రహంలా ఉన్నాడు. ప్రకాశించవలసిన రీతిగా అతను ప్రకాశించడంలేదు. అతను పూర్తిగా మెలకువతో ఉన్నట్టులేదు. దిక్కులు మర్చిపోయినట్టు నడుస్తున్నాడు.

అతనొక సన్యాసి.

మధ్యమధ్య వీచే గాలికి అతను కట్టుకొన్న కాషాయవస్త్రం ఎగురుతోంది. అతని ఎడంచేతిలో ఉన్న కమండలంలోని నీరు అతను నడిచేప్పుడు మధ్యమధ్య తుళ్ళుతోంది. కుడిచేత్తో అతను వెడల్పాటి తామరాకు పట్టుకున్నాడు. ఆకులో అన్నం ఉంది.

వేడిగా ఉండే ఎండా గాలే కాకుండా అతణ్ణి ఇంకా ఏదో బాధిస్తోంది.

ఆలోచిస్తున్నాడు—ఆలోచిస్తున్నాడు—

వెళ్తే వెనక్కి, పోతే ముందుకు, గమ్యస్థానం చేరగలననే ధైర్యం ఉంటేనే ముందుకి వెళ్లడం, లేదా, బయల్దేరిన స్థలానికే వెనక్కి పోవడం.

ఏదో ఒకటి తేల్చుకోవాలి, ఎక్కడైనా కూర్చొని ఆలోచించుకోవాలి, ముందు ఈ ఎండని తప్పించుకొని నీడలోకి పోవాలి.

అతను ఆగి తల ఎత్తిచూసేడు.

ఎదురుగా అనతిదూరంలోనే ఉంది.

ఆహ్వానిస్తోంది అతణ్ణీ అందర్నీ కూడా.

ఎండలో తళతళా మెరుస్తోంది, గాలికి మెల మెల్లగా కదుల్తోంది. "నీలెక్క నాకేమిటి?" అన్నట్టుగా వడగాలి వీచినప్పుడే చిన్న గాలిపాట పాడుతోంది. విలాసంగా, గంభీరంగా, విశాలంగా ఉంది. చల్లగా, ఇంపుగా, హాయిగా ఉంది.

ఎత్తుగా ఆకాశాన్ని తాకుతోన్నట్టుగా ఉంది. విశాలంగా అంతటినీ ఆక్రమించేటట్టుగా ఉంది. ఆకుపచ్చగా కంటికి చల్లగా ఉంది. ఎండ బారినుండి అందర్నీ రక్షిస్తానని శపథం పట్టినట్టుగా ఉంది.

అది ఒక మర్రిచెట్టు.

ఎండలో నిల్చొని, ఎండ బారినుండి అందర్నీ రక్షిస్తానని శపథం పట్టిన మర్రిచెట్టు ఆతపతప్తుడైన సన్యాసిని రమ్మని ఆహ్వానించింది.

అతను చెట్టువైపు నడిచేడు, చెట్టునీడని చేరేడు.

నున్నగా చెక్కిన రాతిపలకలు ఎన్నో ఉన్నవి చెట్టుకింద. వాటిలో చాలా వాటిమీద మనుష్యులు కూర్చున్నారు; మనుష్యులు పడుకొన్నారు. కొంతమంది ఏవేవో ఆలోచించుకొంటున్నారు. కొంతమంది ఏదీ ఆలోచించకుండా నిద్రపోతున్నారు. గుంపులు గాకూర్చొన్నవాళ్లు మాట్లాడుకొంటున్నారు. గంజాయి తాగేవాళ్ళూ, జూదం ఆడేవాళ్ళూ, బైరాగులూ, బిచ్చగాళ్ళూ, రోగిష్టులూ కూడా కనిపిస్తున్నారు, ఆ చెట్టుకింద.

అక్కడ వారందరికీ, వచ్చిన కొత్తమనిషివల్లా ప్రశ్నల్తో కడిగేసి విడిచిపెడితే నేగాని, నిద్ర పట్టదు. చెట్టు నీడని చేరుతోన్న, చేరిన సన్యాసి, ఆ గ్రామానికి కొత్తవాడని అందరూ గ్రహించేరు. దిగ్భ్రమతో చూసేరు. గుసగుసలాడుకొన్నారు. కాని, పలకరించి, ప్రశ్నించి, అతని ఆలోచనకి అంతరాయం కలిగించడానికి ఎవ్వరూ సాహసించలేదు.

తనమీద ఎన్నో కళ్ళు వాలేయని గమనించకుండానే, తిన్నగావెళ్ళి, చెట్టుమొదల్ని ఓరాతిపలకమీద కూర్చున్నాడు, సన్యాసి.

దేనిమీదా దృష్టి లేకుండా కూర్చున్నాడు.

భోజనంమీద దృష్టి లేకుండా తింటున్నాడు.

భోజనం చేసేడు.

చేశాక, అతని కళ్ళల్లో మబ్బులు విడాయి. అతనికి మెలకువ వచ్చినట్లయింది.

మెలకువగా ఉన్న కళ్ళతో, ఎండవైపూ, మర్రిచెట్టు నీడవైపూ, నీడలో మనుష్యులవైపూ అతను చూసేడు. విచారరేఖల్తో మలినమయిన అతనిముఖంలో మందహాస రేఖ మెరిసింది.

అదిగో అది ఎండ! ఇదిగో ఇది నీడ!

ఆ ఎండ భరించలేక ఈ చెట్టుకిందకి వచ్చి ఈ నీడలో ఈ రాతిపలకమీద కూర్చొని ఇప్పుడే భోజనం చేసేను.

వంట్లో తేలిగ్గా, సుఖంగా ఉంది. కళ్ళకిఅంతా స్పష్టంగా కనిపిస్తోంది.

మృత్యువుని అతి సమీపంగా చూసిన ఈ నా కళ్లు ఈ జీవితాన్ని తిరిగి స్పష్టంగా, స్పష్టంగా, చూడగలుగుతున్నాయి.

సంవత్సరాల తరబడి తపస్సుచేసి జీవిత పరమార్థం కనుక్కోలేకపోయాను.

నా జీవితాన్ని మాత్రం అంతిమదశకి తీసుకువచ్చేను.

ఈదినం, ఆ పిల్ల నన్ను చూసి, సేద తీర్చి, అన్నం పెట్టి రక్షించకపోతే ఏమయ్యుండేది?

ఈసరికి అంతా అంతమయ్యుండేది.

మృత్యుగహ్వరంనుంచి నన్ను వెనక్కి లాగి రక్షించిన ఆ పిల్ల ఎవరు?

ఎవ రా పిల్ల?

కాపుల పిల్ల!

పేరు?

గుర్తు రావటంలేదు.

కాని—

ఆ పిల్లది నిజంగా మంచి పుట్టుక.

ఆ పిల్ల ధన్యురాలు నిజంగా!

ధన్యురాలు ఆ పిల్ల అవును.

ధన్యుణ్ని నేనుమాత్రం కాను.

వడగాలి వెచ్చగా వీచింది. మర్రిచెట్టు గాలిపాట పాడింది. దూరంలో, ఎవరో ఎర్రటి పాడవాటి ఆడమనిషి ఎండలో నడుచుకుపోతోంది.

"ఇతడు నిజంగా ధన్యుడు"

అని ఒకావిడ ఒక దినం అన్న మాటతోనే అంతా ఆరంభమయింది.

ఈనాడు ఓ కాపుపిల్ల నా ప్రాణం కాపాడి నన్ను ఈ జీవితపథాన ఇంకా ఉండేట్టు చేసింది.

ఓనాడు ఓ ఎర్రటి, పొడవాటి, అందమైన ఆడమనిషి నేను జీవితాన్ని త్యజించేట్టు చేసింది.

డాబామీద నిల్చొంది, అతణ్ణి చూసింది.

అన్నది "ఇతడు నిజంగా ధన్యుడు" అని.

ఆవిడ అతనికి దూరపు బంధువు. ఆవిడ అతణ్ణి దగ్గరగా ప్రేమించింది.

ఆవిడది మిసమిసలాడే యౌవనం. ఆవిడది ఉదయకాంతివంటి సౌందర్యం.

సర్వాలంకార భూషితురాలై ఆ సర్వాంగ సుందరి డాబామీద తన స్నేహితురాలితో నిల్చొంది.

ఆ దినం అతను ఎక్కణ్ణించో వస్తున్నాడు.

అతణ్ని చూసి, అతడికి వినిపించేటట్టుగా ఆవిడ తన స్నేహితురాలితో అంది.

"ఇతడికి అందం, ఆరోగ్యం, సిరి, సంపద, విజ్ఞానం, వికాసం, ధైర్యం, సాహసం, అన్నీ ఉన్నాయి. ఇతడు నిజంగా ధన్యుడు. ఇతణ్ని కన్న తలిదండ్రులు ధన్యులు."

అన్నది, ఆ డాబామీద ముద్దుగుమ్మ, అదే డాబా మీద ఉన్న ఇంకో ముద్దుగుమ్మతో.

చెట్టుకింద సన్యాసి ముఖంలో ఉండే విషాదం, ఆ దినం ఆవిడకి, మహారాజులా ఉండే ఆ యువకుడి ముఖంలో కనిపించలేదు.

అతణ్ని పొగడ్తతో ఆకర్షించాలనుకొంది. ఆకర్షించలేక పోయింది.

కాని, ఆమె మాటమాత్రం అతణ్ని ఆకర్షించింది.

"ఇతడు నిజంగా ధన్యుడు."

నేను నిజంగా ధన్యుణ్ణా?

ధన్యత్వం అంటే సౌఖ్యంకదా!

నాకు సౌఖ్యం లేదు.

నేను ధన్యుణ్ణి కాను.

నాకేకాదు; సౌఖ్యం ఎవ్వరికీ లేదు!

సౌఖ్యం ఎవరికైనా ఎలా కలుగుతుంది?

అనే జిజ్ఞాసే ఇంతవరకూ తీసుకువచ్చింది.

ఇంకా లభించలేదు సమాధానం.

ఏది చేస్తే సౌఖ్యం వస్తుంది?

ఏది చేయకుండా ఉంటే సౌఖ్యం ఉంటుంది?

అష్టైశ్వర్యాలతో తులతూగే నాకు సౌఖ్యం ఉండేదికాదు.

మహావైభవంగా జీవించిన నాకే సౌఖ్యం లేనప్పుడు వాళ్ళందరికీ సౌఖ్యం ఎలా ఉంటుంది?!

వాళ్ళందరికీ లేదు కాబట్టే నాకూ ఉండేది కాదు సౌఖ్యం.

వాళ్ళందరూ ఎవరు?

మర్రిచెట్టు నీడని కూర్చొన్న సన్యాసికి విషాదమనే మబ్బు తెరల్లోంచి వాళ్లందరూ కనిపిస్తూనే ఉన్నారు.

వాళ్లందరూ వాళ్లంతా...

ఒకనాడు—

సాయంకాలం విహారానికి వెళ్లేప్పుడు, రాజ వీధినికాక ఇంకోమార్గాన్న, వెళ్ళవలసి వచ్చింది.

ఆమార్గంలో—

అక్కడ, ఇక్కడ, ఎక్కడ చూసినా,

సందులు, గొందులు, కమ్మల గుడిసెలు, మధ్యన మనుష్యులు;

ఘోర దారిద్ర్యం, పాడురోగం, మహా మృత్యువు!

అందరు మనుష్యులూ, మనుష్యులంతా ఇలా బాధపడి చస్తూంటే చూస్తూ ఊరుకోడం ఎలా?!

అరుగో వాళ్లందరూ అరుగో!

అడుగో, ఒకొక్కడూ అడుగో!

ఒకడు,

చనిపోయేవాడు!

అడుగు తీసి అడుగు పెట్టలేకుండా ఉన్నాడు. కట్టెలమోపు నెత్తిని పెట్టుకొని నడవలేక నడుస్తున్నాడు. వంగిన మానులా ఉన్నాడు. ఎండిన కట్టెలా ఉన్నాడు. శరీరంలో ఎముకలూ, నరాలూ మాత్రం కనిపిస్తున్నాయి. మాంసం రవ్వంతయినా కనిపించడంలేదు. వంగిన నడుం కట్టెల బరువుకి విరిగి పోయేట్టుగా ఉంది. అతని ముఖం వాడిపోయి వాడిపోయి ఉంది; దంతాల్లేని ఆతడి నోరు నోరులా లేదు; జీవకళలేని కళ్ళు కళ్ళులా లేవు. అతను మనిషి మనిషిలా లేడు. అతను తొంభయ్యేళ్ల తొక్కు. అతను పనికిమాలిన చెత్తలా ఉన్నాడు. ఎండిపోయిన చెట్టులా ఉన్నాడు. ఆ చెట్టువైపు ఏ పిట్టాకూడా చూడనైనా చూడదు. అతడికి ఎవ్వరూ సహాయం చెయ్యరు. మధ్యాహ్నమంతా కట్టెలు కొట్టి కొట్టి సాయంకాలానికి కళేబరాన్ని ఇంటికి చేరవేస్తున్నాడు. అతను దుర్బలుడు, అసహాయుడు. అతి వృద్ధుడు.

అతను నేడో రేపో చనిపోబోయేవాడు.

ఒకడు,

చనిపోతున్నవాడు!

సాయంకాలపు ఎర్రరంగు ఆకాశం కింద, ధూళిలో నిండిన ఎర్రటిపట్టె కటిక నేలమీద, దారికి పక్కగా, అందరికీ ఎడంగా, దొర్లుతున్నాడు రోగంతో, నొప్పితో. శక్తిలేని పోరాటం చేస్తున్నాడు మృత్యువుతో. ఆ కళేబరాన్ని ప్రాణం విడిచిపెడుతోంది. లోకం అంతా విడిచిపెట్టింది. వేలాదిగా మూగిన ఈగలు మాత్రం విడిచి పెట్టడం లేదతణ్ని. అతను ఆపదలో ఉన్నాడు. అతనికి బాంధవులు లేరు. ఉన్నా రారు. అతనివైపు చూడనైనా చూడకుండా పోతున్నారు అంతా...అంతా.

అతను నేడు చనిపోతున్నాడు.

ఒకడు

చనిపోయినవాడు!

వేళకి సూర్యుడు అస్తమిస్తున్నాడు. వేళ కాకుండానే అతను అస్తమించేడు. మంచంమీద అతను పడిఉన్నాడు. ఆ మంచాన్ని నలుగురు మనుష్యులు మోసుకుపోతున్నారు. అతడి తుదిప్రయాణం సాగుతోంది. అతనికోసం ఏడుస్తోన్నవాళ్ల గుండెలు బాదుకొంటూ మంచం వెనక నడుస్తున్నారు. అతను ఆసమయంలో వెళిపోతున్నాడు. ఏ సమయంలోనూ మరింక తిరిగి రాడు.

అతను చనిపోయినవాడు.

అంతా దారిద్ర్యంలో రోగంతో ఉన్నారు. దుర్బలంగా అసహాయులుగా ఉన్నారు. "ఎందుకు పుట్టించేవు భగవంతుడా!" అని ఏడుస్తున్నారు. చివరికి చస్తున్నారు.

చెట్టుకింద కూర్చొన్న సన్యాసి తన చుట్టుపక్కల కూర్చొన్నవారందరివైపూ చూసేడు.

వాళ్లంతా, ఇదిగో, ఇక్కడకూడా ఉన్నారు!

ఎక్కడికి వెళ్లినా ఉంటారు.

ఆనాటినుంచి ఈనాటివరకూ అంతటా కనిపించే వీళ్లందరికీ, ఇటువంటి వాళ్ళందరికీ సౌఖ్యం లేదు, లేదు, లేనేలేదు.

వీళ్ళందరికీ సౌఖ్యం చేకూర్చడం ఎలా?

అనే ఆలోచనే ఈ వేషంలోకి దింపింది.

సన్యాసి నిట్టూర్చేడు.

సౌఖ్యం! సౌఖ్యం! అందరికీ సౌఖ్యం!

అందుకోసం అన్నిటినీ విడిచిపెట్టి కాషాయ వస్త్రం ధరించి ఇలా రావడం జరిగింది.

అంతేకాని, జీవితానికి భయపడికాదు.

జీవితానికి భయపడి సన్యాసం పుచ్చుకొన్నవారు లేకపోలేదు. అటువంటివారిని చాలామందిని అతను చూసేడు కూడా.

తనూ ఆ విధంగానే చేసి తనని తాను మోసపుచ్చుకొంటున్నాడేమో?

అని ఆలోచించేడు, సన్యసించిన తొలిరోజుల్లోనే—కాని, జీవితానికి భయపడవలసిన పరిస్థితి ఏదీ తనకు జీవితంలో లేదు.

వ్యక్తిగతంగా తన విషయం చూసుకొన్నా, తన కుటుంబ విషయం చూసుకొన్నా, భయపడాల్సిన అవసరం ఏదీలేదు.

అతనికి అన్నీ ఉండేవి, కావలసినవన్నీ దొరకేవి.

"జీవితభారాన్ని మోయలేని దుర్బలుడితడు."

అని తనని వేలెత్తి చూపడానికి

తనకి జీవితం భారంగా ఉండేదే కాదే!

కాని, కన్న తలిదండ్రులకి, కట్టుకొన్న భార్యకి, ప్రస్తుతం కొడుక్కికూడా, తనీరీతిగా చేసినందుకు కష్టంగా, విచారంగా ఉండే ఉంటుంది.

కాని—

లోకంలో ఎందరెందరు ఎన్నిటికోసం బాధపడ్డంలేదూ? అందర్లాగానే వాళ్ళూను.

బాధనుండి అందర్నీ విముక్తిచేయడం ఎలా?

అనే బాధవల్లనే వాళ్ళని విడిచిరావడం జరిగింది.

అందరికీ ముక్తిమార్గం చూపించగలిగిన నాడు వాళ్లకీ చూపించవచ్చు ఆదారి;

అని తనకి తాను సమాధానం చెప్పుకు వస్తున్నాడు సన్యసించినప్పటినుంచీ కూడా.

అదేరీతిగా సమాధానం చెప్పుకున్నాడు మర్రిచెట్టు నీడని కూర్చొని.

అందరూ ఒక్కసారిగా బైటపడాలని సన్యాసికి తెలుసు. ఒక మనిషి బాధపడుతూన్నప్పుడు, ఆ బాధనుండి అతను తప్పించుకోలేనందుకు, అతణ్ని తప్పించలేనందుకు, మిగత అంతాకూడా బాధపడాల్సి వస్తుంది.

కుండలో నీరుంది.

అందులో ఒక్క చుక్కలో ఒక్క విషపు చుక్క కలుస్తే నీరంతా కలుషితం అవుతుంది.

కుండలో నీళ్ళల్లా ఉన్నారు లోకంలో మనుష్యులు.

నీటిలో కలిసిన విషాన్ని చుక్కచుక్కనుంచీ తీసి పారేయాలి.

దుఃఖాన్ని మనిషి మనిషినుంచీ తొలగించి వేయాలి.

అంతవరకూ నాకు విశ్రాంతి లేదు.

ఎవ్వరితోనూ సంబంధం పెట్టుకోకుండా, తమ దుఃఖాన్ని బాపుకొని తమమట్టుకు శాంతి సంపాదించుకొన్నవాళ్లు ఉన్నారు. లేకపోలేదు.

అలా తనుకూడా చేయవచ్చు.

అలా చేసిన సన్యాసులుకూడా శాంతి సంపాదించడంచేత ప్రశాంతంగా గంభీరంగా ఉంటారు. నిర్విచారంగా, సుఖంగా తాము కనుక్కొన్న మార్గాన్న ఒంటరిగా నడుస్తారు.

అటువంటి యతిని చూశాకే తనుకూడా సన్యసించేడు.

కాని, లాభంలేదు.

వారివల్ల, వారి అనుభూతివల్ల లోకానికి లాభం లేదు.

వాళ్ళపద్ధతులు లోకానికి తెలియవు. వాళ్ళకి లోకంతో సంబంధం లేదు.

నీరు ఆవిరయినట్టుగా పైకెగసి కూర్చున్నారు. కుండలో నీటిలో ఎంత విషం కలిసినా వాళ్ళకి అక్కర్లేదు.

అవతల ఇల్లు కాలిపోయింది.

కాలిపోతోన్న ఇంట్లోంచి, పరిగెత్త గలిగిన పెద్దమనిషి బైటకి పరిగెత్తి వచ్చేడు.

ప్రాణంనిలుపుకున్నాడు. నిట్టూర్చేడు. ప్రాణాపాయాన్ని తప్పించుకోగలిగినందుకు ఆనందంతో వణికిపోయేడు.

అంతా బాగానే ఉంది.

కాని—

కాలే ఆ ఇంటిలోపల ఉయ్యాల్లో ఉండిపోయేడు ప్రాకనైనా లేని పసిపిల్లడు.

లోకంలో పసిపిల్లలు కాలిపోతున్నారు. వాళ్లని అలానే విడిచిపెట్టి పెద్దమన్యుషులందరూ పైకి వెళ్లిపోతున్నారు.

అటువంటి పెద్దమనుష్యుల ప్రయోజనం వారికేం ఉంటుంది.

పసిపిల్లలు బైటపడే మార్గంముందు చూడాలి.

అందరూ బైటపడే మార్గం అందరికీ తెలియాలి.

అందుకోసమే కదా, ఒకటీ, రెండూ, మూడూ, నాలుగూ, అయిదూ, ఆరు సంవత్సరాలు గాలిమాత్రం ఆధారంగా ఘోరతపస్సు చేసినది!

ఆరేళ్ల కష్టానికి ఫలితం?

శూన్యం! శూన్యం! శూన్యం!

కాదు, కాదు, కాదు,

శూన్యం కాదు, ఫలితం కనిపించింది.

అయితే—

కావలసిన ఫలితం కాదది. అది అక్కరలేనిది.

ఆరేళ్లి కష్టానికి ఫలితంగా దేహం శుష్కించింది. మృత్యువు ఆసన్నమయింది.

ఆ కాపుపిల్ల కాపాడి ఉండకపోతే, కబళించి వేసేది మహామృత్యువు.

సన్యాసి ముఖంలో విషాదచ్ఛాయలు దట్టమయేయి.

మర్రిచెట్టు అవల ఎండ తీక్ష్ణంగా ఉంది. వేడి విపరీతంగా ఉంది. కట్టెదుట లోకమంతా కాలిపోతూన్నట్టుగా ఉంది.

సన్యాసికి బాధగా బాధగా ఉంది. బాధతో కళ్ళు మూసుకొన్నాడు.

ఇహ లాభం లేదా?

వెనక్కి పోవడమేనా?

కొండ ఎక్కి ఎక్కి, ఇహ దిగజారి పోడమేనా?

జయించ శక్తిలేక శిఖరం చూడకుండా జారిపోడమేనా?

జయం లేదా?

జయం! జయం! జయం!

జయం లేదు.

అపజయం! అపజయం! అపజయం!

అపజయం అంది

ఇతడు పలాయితుడు; ఇతడు పరాజితుడు,

అని అంతా అనడమే కాదు; నేను కూడా అనుకోవలసివస్తోంది.

లేదు! లేదు! లాభం; లేదా లేదా?

చెట్టుకింద జూదం ఆడే గుంపంతా ఒక్కసారిగా గొల్లుమని నవ్వింది. ఎక్కడో ఓ మనిషి చేసిన ఆర్తనాదం ఎక్కణ్ణించో వినిపించింది.

సన్యాసి తన రెండు కళ్ళనీ తెరిచేడు.

పలాయితుడు! పరాజితుడు!

అతను పెదవులు బిగించేడు. కళ్ళని మెరిపించేడు; తల ఎత్తేడు.

నేను పలాయితుణ్ణి కాదు!

నేను పరాజితుణ్ణి కాకూడదు!!

లోకంలో ఆర్తనాదం వినిపించకుండా చేసే వరకూ నేను వెనక్కి వెళ్లను. అపజయాన్ని అంగీకరించను. జయం సంపాదించి తీరుతాను.

సాధించి తీరాలి!

మర్రిచెట్టు దగ్గర్నుంచి ఊళ్లోకి వెళ్లే బాట ఎండలో సుస్పష్టంగా కనిపిస్తోంది.

మనిషిని సౌఖ్యానికి తీసుకుపోయే మార్గం కూడా సుస్పష్టంగా కనుక్కొని తీరాలి.

వెనక్కి వెళ్లనన్నది ముమ్మాటికీ నిశ్చయం.

కాని, ముందుకి పోయే దెలా?

అనే ప్రశ్నకి సమాధానం లభించటం లేదు.

సన్యాసి మళం వేసు కూర్చున్నాడు, మోచేతులు తొడలకి ఆన్చుకొని, చేతులు చెక్కిళ్లని చేర్చుకొని.

చేతులు చెక్కిళ్ళని చేర్చుకొని ఆశ్చర్యపోయేడు.

చెంపలు ఇంత నున్నగా ఉన్న వేల?

తల తడిమి చూసుకున్నాడు.

ఆరేళ్ల జుత్తు అలానే ఉంది.

ఆరేళ్ళ బవిరిగడ్డం ఎక్కడకో పోయింది.

ఎలా పోయింది?

చెక్కిళ్లు మరోసారి తడుముకొంటూండగా అప్పుడు జ్ఞప్తికి వచ్చింది, అదంతా ఆ కాపుపిల్ల చేయించిన పనేనని.

చిలిపి పిల్ల! కాని, మంచిపిల్ల!

బైట ఎండ. ఒంట్లో నీరసం.

ఎండలో నీరసంగా నడుస్తున్నాడు.

కళ్ళు మండిపోతున్నాయి. తల తిరుగుతోంది.

అంతే జ్ఞాపకం.

తరువాత కళ్లు తెరిచేసరికి కనిపించేయి రెండు నవ్వుతోన్న కళ్లు. కళ్ళకి చల్లగా కనిపించింది ఒక నవ్వే ముఖం.

తెల్లని చల్లని ముఖంలో నల్లని చల్లని కళ్లు.

కన్ను తెరిచి చూసేసరికి "బతికే ఉన్నాడు! బతికే ఉన్నాడు" అని కేకలు వేసింది ఆ కాపుపిల్ల, కళ్లతో నవ్వుతూ, చేతుల్తో చప్పట్లు కొడుతూ.

బతికి ఉన్నది తనేనని తెలుసుకున్నాడు.

"ఉండు ఉండు" అన్నది ఆమె.

తను అలానే ఉన్నాడు.

ముఖంమీద చల్లటి నీరు జల్లుతూ, కమ్మటి నవ్వు నవ్వింది.

తనకి తెరలు తెరలుగా తెలివి వస్తోంది.

ఆమె తనని మజ్జిగ తాగమంటోంది.

తనకి తాగాలనే ఉంది, కాని, పెదవులు పూర్తిగా విడ్డం లేదు. ఇంతలో మళ్లీ చీకట్లు క్రమ్మకు వచ్చేయి ఒక్కసారిగా. తరువాత తెలివొచ్చినప్పటికి చుట్టూ కొద్దిగా మనుష్యులున్నారు. నవ్వే ముఖం ఎదురుగా ఉంది.

"మళ్లీ తెలివొచ్చీలోపున ఈపనంతా చేయించి ఉంటుంది" అనుకున్నాడు సన్యాసి, చెక్కిళ్ళు నిమురుకొంటూ, పిల్లని తల్చుకొంటూ, మందహాసం చేసుకొంటూ.

"ఒక్కసారి నీ నీడ చూసుకో! ఇప్పు డెంత బావున్నావో" అని. అందుకే మాటిమాటికీ అంది తన ఇంటికి తీసుకు వెళ్తూ.

తెలివి వచ్చి లేచిన వెంటనేమాత్రం ఆమె ఇచ్చిన మజ్జిగ పూర్తిగా తాగగలిగేడు.

అది మజ్జిగ కాదు. మధువు! అది మధువు కాదు. అమృతం!

వళ్లు చల్లగా ఉంది. వళ్లు వేడెక్కింది. ప్రాణం లేచివచ్చింది.

మబ్బులు విడాయి. కళ్లు చూడగలిగేయి. ఆ పిల్లని చూసేయి.

పదహారేళ్లకి మించని వయసు, కాటికతో దిద్దిన నల్లటి చల్లటి పెద్దకళ్లు, లేతగా లేతగా ఉన్న పెద

వులు. పొడవు ముక్కు, నూదిగడ్డం, కోలముఖం, చెదరిన జుత్తు.

ఆ పిల్ల నవ్వింది.

నవ్వినప్పుడు కనిపించినవి దంతాలనే ఆణిముత్యాలు, నవ్వినప్పుడు రాలినవి నవ్వులనే పువ్వులు.

ముఖంలో సంతృప్తి, సంతోషం.

"నడవగలవా?" అంది.

నడచి చూపించేడు.

"శాబాస్! శాబాస్! బలే! బలే!" అని ఆమె గంతులు వేసింది.

ఆణిముత్యాలు కనిపించేయి. పువ్వులు రాలేయి.

ఆమె నడుస్తోంది. గెంతుతోంది. రెక్కలుంటే ఎగిరిపోయుండును.

తండ్రికి పొలంలోకి అన్నం పట్టుకువెళ్ళింది. అన్నం తినేసిన తండ్రి కొంచెం మజ్జిగా మంచినీరూ మాత్రం మిగిల్చేడు.

ఇంటికి తిరిగి వస్తోంటే దార్లో కనిపించేడు పడిపోయిన సన్యాసి.

ఊరు దూరంగా ఉంది. దగ్గర్లో ఎవరూ లేరు.

"తరువాత అంతా వచ్చేరనుకో! కాని, మొట్ట మొదట నేను చూడకేపోతే, ఆ కాస్త మంచినీళ్లూ, మజ్జిగచుక్కా మిగిలి ఉండకేపోతే నువ్వే మయేవాడివి?"

"చనిపోయి ఉండేవాణ్ణి."

సర్వం విడిచిపెట్టిన సన్యాసిని ప్రాణం విడిచి వెళ్లిపోయేందుకు సిద్ధపడి, చరచరా కొంతదూరం వెళ్ళింది.

అతన్తో ఎట్టి సంబంధం లేని ఆడపిల్ల, చక్కాపోతోన్న ప్రాణాన్ని రెక్కపట్టుకు ఆపింది.

వచ్చిన ప్రాణంతో లేచి నిలబడ్డ సన్యాసిని ఇంటికి తీసుకువెళ్ళింది. అన్నం పెట్టి తినమంది.

పెట్టిన అన్నం పట్టుకొని అతను మర్రిచెట్టు క్రిందకివచ్చేడు. భుజించేడు.

ఆమె పెట్టిన అన్నంతో కడుపు నిండుగా ఉంది. వంట్లో సుఖంగా ఉంది.

ఆ పిల్లకి నే చనిపోతే ఏం కావాలి? బతుకుతే ఏం కావాలి?

ఓ మనిషిని బతికిస్తే తనకి ఏం లాభిస్తుం దనుకొంది?

నే నేమైనా ఇస్తా ననుకొందా?

సన్యసించిన వాళ్లు బూడిదికూడా ఇవ్వరని అందరూ ఎరిగిన విషయమేకదా!

సాయం చేయడం పుణ్యం అనుకొన్నదా?

పాపం, పుణ్యం, అనే మాటలే తెలిసినట్టు లేదా పిల్లకి.

దేనికీ ఆశించకుండా సహాయం చేసింది.

ఓ మనిషిని బతికించగలిగినందుకు సంతోషం పట్టలేక గంతులు వేసింది. కిలకిల కిలాకిలా నవ్వింది.

నేను పడిఉన్న ఆ సమయంలో ఆమె గురించి ఏ కోరికా లేదు ఆమె మనసులో. ఆమెకి వేరే ఆలోచనే లేదు.

స్వార్థం మరచింది. నిష్కామంగా సంచరించింది, సహాయం చేసింది.

అందుకే ఆమెకి, ఆ సంతోషం! అందుకే ఆమెకి ఆ సంతృప్తి!

లోకంలో అంతటా దుఃఖం ఉంది.

దుఃఖాన్ని బాపేందుకు, స్వార్థం మరచి తమ తమ గురించిన కోరికలన్నీ విడిచిపెట్టి మానవులంతా ఒకరికొకరు సహాయం ఏల చేసుకోరు?

ఆ పిల్లలా అందరూ ఎందుకు ఉండరు?

ఆ పిల్లలాగే అందరూ ఉండి తీరాలి!

సన్యాసి కళ్ళు మెరుస్తున్నాయి, అతని జుత్తుని వేడిగాలి కదల్చింది.

ఆ వేడిగాలి మర్రిచెట్టుని కూడా కదల్చింది.

గాలికి పాట పాడింది మర్రిచెట్టు.

పాటకి తలఎత్తి చూసేడు సన్యాసి.

తలదించి చూసేడు నీడని కూర్చొన్న మనుష్యులవైపు.

ఈ నోరులేనిచెట్టు అందరికీ ఇంత చల్లటి నీడని ఎందుకు ఇస్తోంది?

నీడలో హాయిగా కూర్చొన్న మేమంతా ఈ చెట్టుకు నీరయినా పోయమే!

మా అందరి దగ్గర్నుంచీ ఏమీ కోరకుండా, మండుటెండని మధ్యలో ఆపి ఎందుకు మా అందరికీ గొడుగుపట్టిందీ మర్రిచెట్టు?

మర్రిచెట్టు ఇంకా పాడుతూనే ఉంది. అతను తిరిగి తలఎత్తి చూసేడు.

మర్రిచెట్టునీడ చల్లటి నీరులా ఉంది. నీటిలో చేపల్లా మెరిసేయి సన్యాసి కళ్లు.

నవనవలాడుతోన్న ఆకుల్తో గలగల నవ్వింది మర్రిచెట్టు, తనేదో ఘనకార్యం చేసినట్టు, ఎంతో సంతోషంతో, సంతృప్తితో.

ఈ మర్రిచెట్టుకి ఎందుకింత నవ్వు?

ఆ కాపు పిల్లకి ఎందుకంత నవ్వు?

'నాకు ఇది కావాలి, నాకు అది కావాలి'

అనేదిలేదు, దీనికీ, ఆమెకి.

నీగురించి నాచేతనైన సహాయం చేస్తాను. అందు గురించి నాకేం అక్కర్లేదు నీ దగ్గర్నుంచి అని నిష్కామంగాచేసి చూపెట్టింది ఆ కాపుపిల్ల! చేసి చూపెడుతోంది ఈ మర్రిచెట్టు!

కోరికల్ని చంపుకోవాలి. సహాయం చేయాలి.

సేవ చేయాలనే కోరికమాత్రం ఉండాలి.

కోరికలేకుండా మాత్రం సేవచేయాలి.

సేవ! సేవ! సేవ!

నిష్కామంగా, నిష్కామంగా, నిష్కామంగా...

మర్రిచెట్టు అవల ఎండ చాలా హెచ్చుగా వెలుగుతోంది.

మర్రిచెట్టుదగ్గర్నుంచి ఊళ్లోకిపోయేదారివెంబడి ఓ తెల్లటి ఆవు ఒంటరిగా మెల్లగా నడుస్తూ వస్తోంది.

చేపల్లా ఉండే సన్యాసి కళ్లు మర్రిచెట్టు నీటి నీడలో బంగారు చేపల్లా తళతళ లాడేయి; మిలమిల మెరిసేయి.

అదిగో అది వెలుగు! అదిగో అది దారి!

ఇదే ఇదే దారి! ఇదే ఇదే వెలుగు!

ఇంత స్పష్టంగా, ఎంతో స్పష్టంగా కట్టెదుట కనిపిస్తోంది. కాబట్టే ఇంతకాలం కళ్లకి కనిపించీ కూడా కనిపించలేదు.

నాకీదినం చీకట్లు విడ్డాయి. వెలుగు సుస్పష్టంగా కనిపిస్తోంది.

ఆ కాపుపిల్ల, ఈ మర్రిచెట్టు, నిజంగాధన్యులు!

ఈచెట్టుకి, ఆపిల్లకి నేను నిజంగా కృతజ్ఞుణ్ణి.

ఆపిల్లపేరేమిటో గుర్తు రావటం లేదు.

"పేరేదయితేనేం? మంచిపుట్టుకగలదాపిల్ల"

అనుకొన్న సన్యాసికి అప్పుడు జ్ఞప్తికి వచ్చింది ఆ పిల్ల పేరు అదేనని.

"అదే అదే ఆపిల్లపేరే అది! సుజాత! సుజాత!" అనుకొంటూ అతను లేచేడు.

ఒకదినం మధ్యాహ్నం, ఒక మర్రిచెట్టునీడలో, ఒక కాపుపిల్ల పేరు స్మరిస్తూ ఒక సన్యాసి లేచి నిల్చున్నాడు.

నీడలో నిల్చొన్న ఆ సన్యాసి వెలుగుచూసేడు.

అతనికి జ్ఞానోదయమయింది. అతను బుద్ధుడయేడు.

బుద్ధుడైన ఆ సన్యాసి ఆ మధ్యాహ్నపు వెలుగులోకి నడిచేడు.

ఆ సమయంలో—

మండే సూర్యుడు మంచు కురిపించేడు.